రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు చోడవరం విద్యార్థులు

విశాలాంధ్ర - చోడవరం: ఈ నెల 5, 6, 7 తేదీల్లో కర్నూలులో జరగనున్న రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు చోడవరం నుండి ఇద్దరు విద్యార్థులు పాల్గొంటున్నట్లు పతంజలి యోగా శిక్షణ కేంద్రం యోగా గురువు పుల్లేటి సతీష్ శుక్రవారం మీడియాకు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు గొంతిన లయ వర్ధన్, పొట్నూరు పవన్ కుమార్‌లున్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలవాలని పలువురు అభినందనలు తెలియజేసారు.

ప్రభుత్వాసుపత్రిలో ఆడిందే ఆట...పాడిందే పాట..!

అందుబాటులో లేని వైద్యులు
నర్సులే డాక్టర్లుగా చలామణి

విశాలాంధ్ర - బుచ్చయ్య పేట: మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి తీరు అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అనే విధంగా తయారైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం, పాలకుల అలసత్వంతో ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల పనితీరు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్టుగా ఉంది. బుచ్చయ్యపేట మండల కేంద్రానికి వివిధ పనుల మీద చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే వారు ఆస్పత్రిలో వైద్యం కోసం వస్తే డాక్టర్ ఎప్పుడు ఉంటారో కూడా తెలియక సకాలంలో వైద్యమందక రోగులు అవస్థలు పడుతున్నారు. ఉన్న సిబ్బంది కూడా ఓపి రిసిప్ట్ చింపడం తప్ప వైద్యం చేసేవారు లేకపోవడం గమనార్హం. ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామాలలో ఏ ఇంటిలో చూసిన విష జ్వరాలతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్న సమయంలో వైద్యులు సమయానికి అందుబాటులో ఉండడం లేదని అన్ని రోగాలకూ ఒక్కటే మందు అన్న చందంగా బుచ్చయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడు ఒక్కరే ఉంటున్నారు. ఇక్కడ పనిచేసే వైద్యులు ఇష్టానుసారం విధులకు హాజరవుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహించాల్సిన ప్రభుత్వ వైద్యులు సాయంత్రం నాలుగు గంటల వరకు ఉండవలసినప్పటికీ వైద్యులు ప్రతిరోజు 1 గంటకే వెళ్ళిపోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. హాస్పటల్‌లో ఉన్నటువంటి రిసెప్షనిస్టులు వైద్యాధికారులుగా మారడంతో అన్ని రకాల వ్యాధులకు ఒకే రకమైన మందులు ఇస్తున్నారని ఈ విధంగా ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్న వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆవేదన వ్యక్తం

చేస్తున్నారు. దీంతో ప్రజలు చేసేది ఏమీ లేక గ్రామాలలో ఉన్నటువంటి ఆర్ఎంపీ వైద్యులను సంప్రదిస్తే వారు వచ్చిరాని వైద్యం చేయడం మూలంగా ఉన్న ఆరోగ్యం కాస్త పూర్తిగా పాడవుతుందని చివరకు కార్పొరేట్ ఆసుపత్రులకి వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందని, దీంతో అధిక బిల్లులు సమర్పించుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇకనైనా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు స్పందించి మెరుగైన వైద్యం అందించాలని ప్రజలు కోరుతున్నారు.

డీఆర్డీఏ పీడీగా లక్ష్మీపతి

విశాలాంధ్ర - గొలుగొండ: ఉమ్మడి విశాఖపట్నం డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా బి.లక్ష్మీపతి బాధ్యతలు చేపట్టారు. నిబద్ధత క్రమశిక్షణతో పని చేయడంతో పాటు గతంలో జిల్లా ఆణిముత్యంగా అవార్డు పొందిన లక్ష్మీపతి బాధ్యతలు తీసుకోవడం పట్ల ప్రజా సంకల్ప వేదిక కార్యదర్శి జక్కు నరసింహమూర్తితో పాటు పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గతంలో శ్రీకాకుళంలో జిల్లా పరిషత్ సీఈవోగా పనిచేస్తూ విశాఖపట్నం డీఆర్డీఏ పీడీగా చేస్తూ జిల్లాల పునర్విభజనలో అనకాపల్లి పీడీగా పనిచేసిన కాలంలో మహిళలు అభివృద్ధికి ఎంతో కృషిచేసి రాష్ట్రంలోనే మంచి గుర్తింపు తెచ్చారని, స్త్రీ నిధిలో మార్పులు చేసి మహిళలకు ఎంతో మేలు చేశారన్నారు. లక్ష్మీపతికి విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు డి.సూరిబాబు, పాడేరు అధ్యక్షులు డి.ప్రసాద్, అనకాపల్లి కన్వీనర్ ఎం.వి.రమణ, డి.వీరబాబు, ఉమ్మడి విశాఖ జిల్లా మహిళా సంఘాల కన్వీనర్ ఎం.రాజారత్నం తదితరులు అభినందనలు తెలిపారు.

గోవాడ సుగర్స్ రైతు సంక్షేమ నిధి నుండి చెల్లింపులు

- ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు చేతుల మీదుగా వారసులకు చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం సహకార చక్కెర కర్మాగారం పరిధిలో మరణించిన 141 మంది సభ్య రైతు కుటుంబాల వారసులకు రైతు సంక్షేమ నిధి నుండి రూ.40 లక్షలు చెక్కులను స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ ఫ్యాక్టరీని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఎం.డి. వి.సన్యాసి నాయుడు మాట్లాడుతూ 2008 - 09 సీజన్ నుండి 2020-21 వరకు క్లెయిమ్ చేసిన 341 మంది సభ్య రైతులకు గాను 141 మందికి పరిహారం చెల్లించామన్నారు. మిగిలిన 200 మంది రైతు కుటుంబాలకు దశల వారీగా చెల్లిస్తామన్నారు. 2008-09 నుండి 16 సీజన్‌ల నుండి సభ్య రైతులు వద్ద వసూళ్లు చేసిన మొత్తానికి అదనంగా రూ.3 దాకోట్ల 20 లక్షలు జత చేసి చెల్లించామన్నారు. 2021-22 సీజన్ నుండి 31.08.2023 వరకు 225 క్లెయిమ్ లు పెండింగ్ లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సి.డి.ఓ. కె.రామం, ఏఓలు ఎస్.నాగేశ్వరరావు, యూనియన్ నాయకులు కె.భాస్కర్, శరగడం రాము నాయుడు, రాయి సూరిబాబు, సరకాన అప్పలనాయుడు, సుగర్స్ రైతు సభ్యుల కుటుంబాలు, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాబుపై నమ్మకంతోనే రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు

హోంమంత్రి వంగలపూడి అనిత

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు ద్వారానే నిరుద్యో గులకు ఉపాధి అవకాశాలు వస్తాయని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీద నమ్మకంతో రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించడానికి పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్లాన్‌పై అధికారులతో, రాష్ట్ర హోం మంత్రి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో అభివృద్ధికి ఎక్కువ అవకాశమున్న పరిశ్రమలు, పర్యాటకం, వ్యవసాయం రంగాలపై లోతుగా ఆలోచించి కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. ఎంతోమంది విలువైన సూచనలు చేశారని, విజన్ ప్రణాళిక ఇప్పటి నుండి మొదలు పెడితేనే రాబోయే 22 ఏళ్ళలో లక్ష్యాలు సాధించడానికి దోహద పడుతుందన్నారు. స్వర్ణాంధ్ర-2047 విజన్

ప్లాన్‌ను ప్రజలు భాగస్వామ్యంతో తయారు చేయాలని ఆమె సూచించారు. పేద ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్య సౌకర్యాలను అందించే విధంగా ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. ఇది మనకు వచ్చిన మంచి అవకాశమని దానిని సద్వినియాగం చేసుకుంటూ భావితరాలకు ఉపయోగపడే విదంగా మనసుపెట్టి ప్రణాళిక తయారీలో భాగస్వాములు కావాలని అధికారులకు సూచించారు. ముందుగా జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ జిల్లాలో స్వర్ణాంధ్ర 2047 విజన్ కార్యాచరణ ప్రణాళిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు సహకారంతో తయారు చేయడానికి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అన్నారు. రాష్ట్రంలో స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్లాన్ తయారు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. రాష్ట్రాన్ని రాబోయే 25 సంవత్సరాలలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించే దిశగా తయారు చేయడానికి ముఖ్యమంత్రి చర్యలు చేపట్టారని, స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో ప్రజల సూచనలు, సలహాలు తీసుకోవడానికి క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలో ప్రజలందరూ స్వర్ణాంధ్ర 2047 విజన్ కొరకు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సూచనలు సలహాలు పొందుపరచాలని ఆమె సూచించారు. జిల్లా ప్రణాళికా అధికారి రామారావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ రంగాలలో జిల్లా ప్రగతిని, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి దయానిధి, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ రామారావు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు శ్రీ విద్యాంజలి హైస్కూల్ విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర - నర్సీపట్నం: ఈనెల 5న నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి ఆటియా పాటియా పోటీలకు నర్సీపట్నం శ్రీవిద్యాంజలి హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ అక్షజ్ కృష్ణ విద్యార్థులకు జెర్సీలు అందజేశారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని, శారీరక మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఆటల పోటీల్లో బాగా రాణించి పాఠశాలకు నర్సీపట్నంకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శాంతి, హెచ్‌ఎం రామకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయుడు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల ఎంపీడీఓగా అప్పారావు

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల ఎంపీడీఓగా కొంకి అప్పారావు శుక్రవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. ఆయన కాకినాడ జిల్లా కరప మండలం నుండి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ 2014 నుండి 2019 వరకు మాడుగుల ఈవోపీఆర్డిగా పని చేశానని, మాడుగుల మండలం అనుభవం ఉందన్నారు. మండలాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బంది ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



బెస్ట్ సోషల్ సర్వీస్ వాలంటీరుగా కొణతాల

విశాలాంధ్ర - అనకాపల్లి: సామాజిక అవగాహన కార్యక్రమాల ద్వారా తన వంతు సామాజిక సేవ చేస్తున్న కొణతాల అప్పలరాజుకు బెస్ట్ సోషల్ సర్వీస్ వాలంటీరుగా అవార్డును కలెక్టర్ విజయ్ కృష్ణన్ అందజేశారు. ఇలాంటి మరెన్నో సేవలు అందించాలని ఇటువంటి సోషల్ అవేర్నెస్ కార్యక్రమాలు జరిగేటట్లుగా చూడాలని, ఇటువంటి మంచి కార్యక్రమాలకు తమ తరుపు నుండి ప్రభుత్వం తరఫునుంచి, మంచి ప్రోత్సాహం అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలియజేశారు. జిల్లా వైద్యాధికారి జీ.వి. రమణ కుమార్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్ను ఆయన అందుకున్నారు.

ఉచిత ఇసుక హామీ అమలు చేయాలి

భవన నిర్మాణ కార్మికుల నిరసన

విశాలాంధ్ర - మునగపాక: రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మండలంలోని నాగవరం గ్రామంలో సచివాలయం వద్ద నిరసన తెలియజేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి వంద రోజులు అయినా నేటికీ ఉచిత ఇసుక హామీ అమలు కాలేదని, దీంతో భవన నిర్మాణ కార్మికులు పనులు లేక పస్తులు ఉండాల్సి వస్తుందని, భవన యజ మానులు కూడా ఇసుక కోసం తంటాలు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం తన హామీని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి వి.వి శ్రీనివాసరావు ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం కంటే నేడు ఇసుక ధర పెరిగిందని దీంతో భవన నిర్మాణదారులు నిర్మాణాలకు విముఖత చూపటంతో భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక అర్ధాకలితో అలమటిం చాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు.

రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం కూటమికి 100 రోజులు అవుతున్నా నేటికీ ఉచిత ఇసుక హామీ అమలు కాకపోవడం శోచనీయమని అన్నారు. ప్రభుత్వం తక్షణమే ఉచిత హామీ అమలు చేయాలని, లేనట్లయితే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమించాల్సి వస్తుందని ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు పాలివిని అప్పారావు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

మండల పరిషత్ ఏవోగా రాధ

విశాలాంధ్ర - యస్.రాయవరం: ఎస్.రాయవరం మండలం మండల పరిషత్ అడ్మినిస్ట్రేషన్ అధికారిగా ఈ.రాధ బాధ్యతలు స్వీకరించారు. ఈ స్థానంలో పనిచేసిన ఏవో రమణ రాజుకు రాంబిల్లి బదిలీ అవడంతో విశాఖ జిల్లా పద్మనాభం మండలం ఏవోను నియమించడం జరిగింది. దీనితో ఆమె బాధ్యతలు స్వీకరించి సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. అనంతరం ఎంపీడీవో సత్యనారాయణను కలిసి మండల పరిషత్ అడ్మినిస్ట్రేషన్ విషయాలను అడిగి తెలుసుకున్నారు.

గ్రామ సర్వేయర్‌లు రైతులకు అందుబాటులో ఉండాలి

విశాలాంధ్ర - యస్.రాయవరం: గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న సర్వేయర్‌లు రైతులకు అందుబాటులో ఉండాలని మండల తహశీల్దార్ జె.రమేష్ బాబు సూచించారు. శుక్రవారం తహశీల్దార్‌ను కలిసి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు భూ సమస్యలకు సంబంధించి సర్వే దరఖాస్తు చేసుకుంటే సకాలంలో పని పూర్తి చేయాలని సూచించారు. గతంలో జరిగిన రీ సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు విషయాలు చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ త్రిమూర్తి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏంటి

- దేవుడ్ని రాజకీయాల్లోకి లాగడం న్యాయమేనా
- మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

విశాలాంధ్ర - చోడవరం: ప్రజలు అభిమానాన్ని చూరగొన్న కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమిటని చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ప్రశ్నించారు. వై.సి.పి. కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాటి జగన్ ప్రభుత్వం కేవలం సంక్షేమాన్ని మాత్రమే చేయగలిగింది అని, అత్యంత రాజకీయ అనుభవజ్ఞుడు అయిన చంద్రబాబు నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమం చేస్తారని అత్యధిక ప్రజలు విశ్వసించితే, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అందించి, పేద మధ్య తరగతి ప్రజలు అందర్నీ మోసం చేస్తున్నారని తెలిపారు. ప్రపంచ దేశాల్లో ప్రఖ్యాతి గాంచిన తిరుపతి వేంకటేశ్వరునికి రాజకీయాలు ఆపాదించడం న్యాయమేనా అని ప్రశ్నించారు. రహదారులు, అభివృద్ధి, సంక్షేమాన్ని చేసి ప్రజల విశ్వాసాన్ని పొందాలని హితవు పలికారు. గోవాడ సుగర్స్‌లో కార్మికులు, కర్షకుల బకాయిలు దసరాలోగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బొడ్డేడ సూర్య నారాయణ, వెంపలి ఆనంద్, దొడ్డి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



గోవులను తరలిస్తున్న వ్యాన్ పట్టివేత

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలోని అడ్డరోడ్డు సమీపంలోని అనధికారికంగా గోవులు తరలిస్తున్న వ్యాన్‌ను ఎస్.రాయవరం పోలీసులు పట్టుకున్నారు. స్థానిక ఎస్ఐ విభూషణరావు అందించిన వివరాలు ప్రకారం ఆవులు అక్రమంగా తరలి వెళ్తున్నాయని, సమాచారంతో తనిఖీ చేయగా 55 ఆవులతో ఉన్న వ్యాన్‌ను పట్టుకోవడం జరిగిందన్నారు. కంచిలి నుండి హనుమాన్ జంక్షన్‌కు తరలిస్తున్నట్లు విచారణలో తేలిందని దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని వెల్లడించారు.

భారీ అన్నసమారాధన

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం వీరనారాయణం గ్రామంలో గొర్లి వారి కల్లాల దగ్గర వెలసియున్న దుర్గమ్మ తల్లి గుడి దగ్గర బుల్లి వారి కుటుంబాల ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన జరిగింది. అమ్మవారికి తెల్లవారిన దగ్గర నుండి ధూపదీప నైవేద్యాలు అభిషేకాలతో ఆలయం కిక్కిరిసిపోయింది. ప్రతి ఏడాదిలాగే ఈ సంవత్సరము కూడా భారీ అన్న సమారాధన గోర్లు వారు కుటుంబాలన్నీ కలిపి పెట్టడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో అమ్మవారిని దర్శించుకుని ప్రసాదం స్వీకరించిన వారిలో దాసరి అచ్యుతరావు, ఎల్లపు కొండ అప్పారావు, తూరివిల్లి సత్యంబాబు, దాసరి రాజు, తలారి శ్రీను, పర్రె సూరిబాబు, గొర్లి కృష్ణ, గొర్లి ఈశ్వరరావు, రమేష్, చిన్నారావు, చిన్న రమేష్, మోదినాయుడు, కన్నమనాయుడు, దాసరి వెంకటరమణ, కిరణ్, మహారాజ్, సత్య ప్రసాద్, అగ్రపు రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను మెరుగుపరిచే దిశగా విద్యాబోధన సాగాలి: అనిత

విశాలాంధ్ర - పాయకరావుపేట: నైపుణ్యాలను మెరుగుపరిచే దిశగా విద్యా బోధన సాగాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. గత మూడు రోజులుగా శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలనందు నిర్వహిస్తున్న క్లస్టర్ -7 ఆంధ్రా, తెలంగాణా అంతరాష్ట్ర కబడ్డీ, వాలీబాల్ ఛాంపియన్ షిప్ పోటీలు ఘనంగా ముగిసాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుండి 100కి పైగా స్కూల్స్ నుండి సుమారు 1200 మంది క్రీడాకారులు ఈ పోటీల నందు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడాస్ఫూర్తిని చాటుకున్నారు. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ విద్యార్థులు చదివితేనే తెలివైనవారు కాదన్నారు. ఏ రంగంలో రాణించినా తెలివైన వారే అన్నారు. ఆడపిల్లలు తలొంచేలా కాకుండా అన్యాయం జరిగినపుడు తిరగబడేలా ఉండాలని సూచించారు. ఆత్మవిశ్వాసం ఆటల ద్వారా పెరుగుతుందని, ఇవి ఉపాధ్యా యులు, కోచ్‌లు విద్యార్థులకు నేర్పాలని, చదువు, క్రమశిక్షణ, ఆటలు, సాంస్కృ తిక కార్యక్రమాలు, సంస్థాగత నైపుణ్యాలు నేర్పే విద్యాలయాలలో శ్రీ ప్రకాష్ ఒకటని తెలిపారు. 3 రోజుల నుండి సుదూర ప్రాంతాల నుండి గెలుపే లక్ష్యంగా ఆడి గెలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు. గౌరవ అతిథిగా విచ్చేసిన రిటైర్డ్ జిల్లా స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఎన్.సూర్యారావు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకు విద్యా సంస్థలు ఇస్తున్న ప్రాధాన్యత వల్లనే ఈ సంవత్సరం ఈ పాఠశాల నుండి సుమారు 100 కి పైగా విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికకావడం ఒక ఉదాహరణగా చెప్పవచ్చని, విద్యార్థులు నిత్యం క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ క్రీడలకు

చదువుతో పాటుగా ప్రాధాన్యమిస్తున్న విద్యార్థినులు మంచి శారీరక దృఢత్వంతో పాటు మానసిక ధైర్యం పొందడమే కాకుండా గెలుపు ఓటమిలను సమాన దృష్టితో చూసే ఆలోచనా దృక్పథం వీరు అలవరచు కోవడం ఆటల పోటీల ద్వారా సాధ్యమవుతుందని, పోటీల నందు ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు అర్హత పొందుతారని తెలిపారు. అనంతరం శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు వంగలపూడి అనితను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేసారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు మెడల్స్, జ్ఞాపికలను అందజేశారు.

విజేతల వివరాలు: కబడ్డీ అండర్ - 14 విభాగంలో పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ ప్రథమ బహుమతి సాధించగా, తెలంగాణ రాష్ట్రానికి చెందిన న్యూ డైమెన్షల్ హైస్కూల్ ద్వితీయ బహుమతి సాధించింది. అండర్ - 17 విభాగంలో కృష్ణా జిల్లా, హీల్ స్కూల్ ప్రథమ

బహుమతి సాధించగా, తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రబోధానంద ప్రశాంతినికేతన్ ద్వితీయ బహుమతి సాధించింది. అండర్ - 19 విభాగంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్ ప్రథమ బహుమతి సాధించగా, ది హార్ట్ ఫుల్ లెర్నింగ్ సెంటర్ స్కూలు ద్వితీయ బహుమతి సాధించింది. అలాగే వాలీబాల్ అండర్ - 14 విభాగంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన సంఘమిత్ర స్కూల్ ప్రథమ బహుమతి సాధించగా, డిఏవి పబ్లిక్ స్కూల్ ద్వితీయ బహుమతి సాధించింది. అండర్ - 17 విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కి చెందిన నవనీత పబ్లిక్ స్కూల్ ప్రథమ బహుమతి సాధించగా, మాంటిస్సోరి ఎలైట్ స్కూల్ ద్వితీయ బహుమతి సాధించింది. అండర్ - 19 విభాగంలో తెలంగాణకు చెందిన డి.పి.ఎస్. పబ్లిక్ స్కూల్ ప్రథమ బహుమతి సాధించగా, ఆంధ్రప్రదేశ్‌కు అక్షర విద్యాలయ ద్వితీయ బహుమతి సాధించింది.

కార్పొరేషన్ చైర్మన్‌లకు సుందరపు అభినందన

విశాలాంధ్ర - మునగపాక: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో రాష్ట్రస్థాయిలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్‌గా శు క్రవారం ప్రమాణ స్వీకారం చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్పస్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ చైర్మన్ పీలా గోవింద్ సత్యనారాయణ, మినీ రవి నాయుడు, ఏపీ టిట్కో చైర్మన్ శివశంకర్, తదితర కార్పొరేషన్ చైర్మన్‌లను ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఆయన వెంట మునగపాక మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

కేజే.పురంలో జనసేన నాయకుల భజన కార్యక్రమం

విశాలాంధ్ర - వి.మాడుగుల: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా జనసేన నాయకులు మండలంలో కేజే.పురం శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి సన్నిధిలో హరినారాయణ సంకీర్తన భజన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అదే విధంగా నిన్న నవరాత్రి పర్వదిరాన మొదటి రోజు కావడంతో కేజే.పురం భవాని భక్తులు కూడా కార్యక్రమం పాల్గనడం జరిగింది. భజన అనంతరం భవాని భక్తులకు సద్ది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి చీడికాడ జనసేన నాయకులు ముర్రు ఈశ్వరరావు అతిథిగా రావడం జరిగింది. భజన అనంతరం ఈశ్వరరావుకు జనసైనికులు, గుడి యాజమాన్యం సాలువ కప్పి సన్మానించి స్వామివారి ప్రతిమను అందజేశారు. ఈ కార్యక్రమంలో కేజే.పురం జనసేన నాయకులు కాళ్ల హరిబాలకృష్ణ, శ్రీనాధు శేఖర్, రాపేటి రాజశేఖర్ నాయుడు, ఆకులరవి కిరణ్, లంక అజయ్, వెంకట్, పినిశెట్టి వినయ్, రాపేట జగన్, గ్రామ శాఖ కార్యదర్శి కర్రి ఈశ్వర్, పాలకుర్తి పవన్ పాల్గనగా ఈ కార్యక్రమం మాడుగుల మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షులు కాళ్ళ హరి బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. టిఫిన్స్ దాతలు జగన్,బాలకృష్ణ, కర్రి ఈశ్వర్, శ్రీనాథ్ శేఖర్, జన జన సైనికులు ఆర్థిక సహాయం చేశారు.

181 కేజీల గంజాయి స్వాధీనం

నలుగురు వ్యక్తులు అరెస్టు, ఆటో సీజ్

విశాలాంధ్ర - గొలుగొండ: వాహనాల తనిఖీల్లో భాగంగా ఏజెన్సీ ప్రాంతం నుండి మైదాన ప్రాంతానికి తరలిస్తున్న 181 కేజీల గంజాయి స్వాధీనం చేసుకొని నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు కృష్ణ దేవి పేట ఇన్చార్జి ఎస్ఐ సిహెచ్ భీమరాజు తెలిపారు. తమ సిబ్బందితో స్థానిక అల్లూరి సీతారామరాజు పార్కు వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా కొయ్యూరు గ్రామానికి చెందిన గెమిలి రవి, చింతపల్లి మండలం వట్టి పూసల గ్రామం పాంగి శాంతి, కొయ్యూరు మండలం శరమండ గ్రామానికి చెందిన గెమ్మిల కిరణ్, జీకే వీధి మండలం కొండపల్లి గ్రామానికి చెందిన తంబేలి మల్లేష్ ఆటోలో గంజాయిని తరలిస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. నిందితుల నుండి నాలుగు సెల్ ఫోన్లు, ఆటోను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించినట్లు ఎస్సై భీమరాజు తెలిపారు.

పనిచేసే చోట మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యత

వీఎంఆర్డీఏ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఎంసీ విశ్వనాథన్

విశాలాంధ్ర - విశాఖ : పనిచేసే చోట మానసిక ప్రశాంతతకు తగిన ప్రాధాన్యత ఇవ్వవలసిన అవసరం ఎంతైనా ఉందని తద్వార సంస్థ ప్రగతికి ఉద్యోగస్తులు మరింత తోడ్పాటు అందిస్తారని, సమాజానికి మరింత ఉత్సాహంగా సేవలు అందిస్తు, విధులు నిర్వహించదానికి వీలుంటుందని వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ కెఎస్ విశ్వనాథన్ అన్నారు. వీఎంఆర్డీఏ ఆవిర్భావ దినోత్సవం సందర్భముగా బాలల ప్రాంగణంలో శుక్రవారం జరిగిన వేడుకల్లో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ఉండే పని ప్రదేశం ఒత్తిడి లేని ప్రదేశముగా మారాలంటే తరచూ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించాలని అన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. జాయింట్ కమీషనర్ రమేష్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక భూమికను పోషిస్తూ టిడివికి నుంచి వుడా, వీఎంఆర్డీఏ గా రూపాంతరం చెంది ప్రజల మనస్సుల్లో బలమైన ముద్ర వేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి శిల్ప, ప్రధాన ఇంజనీర్ భవానీ శంకర్, పర్యవేక్షక ఇంజనీర్ బలరామరాజు, డిఎఫ్ఓ శాంతి స్వరూప్, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గొలుగొండలో క్రీడా స్థలం కేటాయించాలి

విశాలాంధ్ర - గొలుగొండ: మండల కేంద్రమైన గొలుగొండలో క్రీడాకారులుకు అనువైన క్రీడా స్థలాన్ని ఏర్పాటు చేయాలని తహశీల్దార్ పి.శ్రీనివాసరావును కూటమి నాయకులు కలిసి శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కసిపల్లి అప్పారావు మాట్లాడుతూ క్రీడాకారులు అందరికీ అనువైన క్రీడా స్థలం మండల కేంద్రంలో ఏర్పాటు చేసినట్లయితే యువకులకు, విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. దీనిపై తహశీల్దార్ పి.శ్రీనివాసరావు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, జనసేన, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

తునివలసలో చురుకుగా రామాలయ పనులు

విశాలాంధ్ర - చీడికాడ: మండలంలోని తునివలస గ్రామంలో గ్రామస్తుల సహకారంతో నూతనరామాలయ పనులు చురుకుగా సాగుతున్నాయి. రామలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తులు నూతన రామాలయం నిర్మాణానికి ఇటీవల శ్రీకారం చుట్టారు. గ్రామస్తులు చందాలు వేసుకుని నూతన రామాలయాన్ని నిర్మిస్తున్నారు. మండలానికి చెందిన భక్తులు విరాళాలు అందించి తమకు సహకరించాలని సర్పంచ్ పడాల హైమ కోరారు.

ఖండివరంలో ఎన్టీఆర్ గృహాల సర్వే

విశాలాంధ్ర - చీడికాడ: మండలంలోని ఖండివరం గ్రామంలో 2014 నుండి 2019 వరకు నిలిచిన ఎన్టీఆర్ గృహాల లబ్ధిదారులకు నిలిచిన నగదును చెల్లించేందుకు శుక్రవారం గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించామని హౌసింగ్ ఏఈ యం.సూరిబాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వివిధ గ్రామాలలో ప్రభుత్వం నిరుపేదలకు అందించిన 698 మంది గృహాల లబ్ధిదారులకుగాను 2 కోట్ల 6 లక్షల 84 వేల 189 రూపాయలు అందించవలసి ఉందన్నారు. లబ్ధిదారుల నుండి ఇంటి వివరాలు సేకరించి ఈ సర్వే రిపోర్ట్ ఉన్నతాధికారులకు అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈవో, వర్క్ ఇన్స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర - అనకాపల్లి: టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ సైబర్ దాడులు ఎక్కువ అవుతున్నాయని సోషల్ మీడియా సెల్ ఇన్స్పెక్టర్ వినోద్ బాబు, ఐ.టీ కోర్ ఎస్సై బి.సురేష్ బాబు, అనకాపల్లి టౌన్ ఇన్‌స్పెక్టర్ టీ.వీ.విజయ కుమార్ అన్నారు. వారి ఆధ్వర్యంలో హిమ శేఖర్ డిగ్రీ కాలేజ్ విద్యార్థులకు సైబర్ క్రైమ్స్ వలన జరిగే అనర్ధాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డెబిట్, క్రెడిట్ కార్డు వివరాలు చోరీ చేసి షాపింగ్ చేయటం తెలిసిందేనని, పిన్ నంబరు కొట్టేసి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బు కాజేయటం కొత్త విషయమేమీ కాదని, సిమ్ స్వాప్ చేసి మన ఫోన్‌కు అందాల్సిన మెసేజ్‌లను మళ్లించి, డబ్బు లాగడం మామూలై పోయిందన్నారు. అజ్ఞాత వ్యక్తులు ఫోన్ చేసి, తీయని మాటలతో మభ్యపెట్టో, నగ్న చిత్రాలతో బెదిరించో ఖాతాలు ఖాళీ చేయటమూ చూస్తున్నదే అన్నారు. సంస్థల కంప్యూటర్ల మీద దాడిచేసి, వాటిని పనిచేయకుండా నిలిపివేయడం, డబ్బులు ఇస్తేనే విడుదల చేయటం మరో తరహా మోసం అయితే తాజాగా డిజిటల్ అరెస్ట్ వంటి కొత్త నేరాలూ వెలుగులోకి వస్తున్నాయని అన్నారు.

డిజిటల్ అరెస్ట్ అంటే.....

సైబర్ నేరాలు పెచ్చుమీరుతున్న రోజుల్లో రోజుకో కొత్తరకం మోసాలు వెలుగు చూస్తున్నాయని, డిజిటల్ అరెస్ట్ ఇలాంటిదేనని, ఇందులో సైబర్ నేరగాళ్లు వీడియో కాల్ చేసి తాము పోలీసులమనో, దర్యాప్తు అధికారులమనో నమ్మిస్తారని, బ్యాంకు ఖాతా, సిమ్ కార్డు, ఆధార్ కార్డు వంటివి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు వినియోగించుకున్నారని బెదిరిస్తారన్నారు. విచారణ పూర్తయ్యేంత వరకూ అక్కడి నుంచి కదలటానికి వీల్లేదని కట్టడి చేస్తారని, డబ్బులు చెల్లిస్తే వదిలేస్తామని చెబుతారన్నారు. వారి ఖాతాలోకి డబ్బులు జమయ్యాక విడిచిపెడతారని, ఇలా మనిషిని ఎక్కడికీ వెళ్లనీయకుండా.. ఒకరకంగా అరెస్ట్ చేసినట్టుగా నిర్బంధించటమే డిజిటల్ అరెస్ట్ అన్నారు. డిజిటల్ అరెస్ట్ కొత్త సైబర్ నేరం కావటం వల్ల ప్రజలు దీన్ని పోల్చుకోవటం కష్టమైపోతోందన్నారు. దర్యాప్తు అధికారులమని తొందర పెట్టటం వల్ల కంగారుపడి, ఏది ఎక్కడికి దారితీస్తోందనే భయంతో జేబులు గుల్ల చేసుకుంటున్నారని తెలిపారు. నోయిడాకు చెందిన ఒక మహిళకు ఒకరు ఫోన్ చేసి, తాను దర్యాప్తు అధికారినని చెప్పారని, 'మీ ఆధార్ కార్డుతో సిమ్ కొన్నారని, దాన్ని ముంబయిలో మనీ లాండరింగ్ కోసం వాడుకున్నారు' అని బెదిరించాడన్నారు. దర్యాప్తు అనేసరికే ఆమె హడలిపోయారని, దీన్ని గుర్తించిన నేరగాడు మరింత రెచ్చిపోయాడన్నారు. తదుపరి విచారణ కోసం కాల్‌ను ట్రాన్స్‌ఫర్ చేశాడన్నారు. అవతలి నుంచి మరో నేరగాడు తాను ముంబయి పోలీసు అధికారినని చెప్పి విచారణ ఆరంభించాడని, ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకూ నిరంతరాయంగా స్కైప్ కాల్ చేశాడని, అంతసేపూ ఆమెను అక్కడి నుంచి కదలనీయలేదని, అతడి ఖాతాలోకి రూ.11.11 లక్షలను ట్రాన్స్‌ఫర్ చేసుకున్నాక గానీ కాల్ కట్ చేయలేదన్నారు. చివరికి తాను మోసపోయానని ఆ మహిళ గుర్తించి సైబర్ పోలీసులను ఆశ్రయించారన్నారు. ప్రజలు ఎవరైనా సైబర్ క్రైమ్ బారిన పడినట్లయితే అధైర్య పడకుండా స్థానిక పోలీస్ స్టేషన్ గాని లేదా జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఐటి కోర్ వింగ్ గాని గోల్డెన్ అవర్ లో వచ్చిన లేదా 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు లేదా http//www .cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని వారు తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల పథకాలు పునరుద్ధరించాలి

విశాలాంధ్ర - చీడికాడ: ఉచిత ఇసుక ఇచ్చి భవన నిర్మాణ కార్మికుల పథకాలను పునరుద్ధరించాలని సిపిఎం మండల కార్యదర్శి రొంగలి దేవుడినాయుడు అన్నారు. మండలంలోని వరాహపురం గ్రామంలో కార్మికుల కలిసి శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక లేక భవన కార్మికులకు పనులు లేక రోడ్డున పడ్డారన్నారు తీవ్రమైన ఇసుక కొరతతో గత నాలుగు నెలలుగా పనులు లేక కార్మికులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నుండి కార్మికులకు అందవలసిన పథకాలు అమలు కాలేదని అన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన మెమో 1214ను రద్దుచేసి వారికి అందవలసిన సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం నిధి చట్టం ప్రకారం నిర్మాణదారుల నుండి సంక్షేమ సేస్సు ఒక శాతం వసూలు చేయాలని కోరారు. స్థానికంగా ఉన్న రీచ్‌ల నుండి ఇసుకను తక్షణమే విడుదల చేయాలని నదీ ప్రవాహక ప్రవాహక ప్రాంతాల నుండి ఇసుక త్రవ్వకాలు అనుమతించాలని అన్నారు. అధికారులు, నాయకులు స్పందించి కార్మికుల సమస్యలు తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం.రామరాజు తదితరులు పాల్గొన్నారు.

వేద మాత గాయత్రి అవతారంలో శ్రీ కనకదుర్గ

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ ఆవరణలో వేంచేసియున్న శ్రీ కనకదుర్గమ్మ దేవాలయంలో శరన్నవరాత్రులు గురువారం నుండి ప్రారంభమయ్యాయి. దుర్గ శరన్నవరాత్రుల్లో మొదటి రోజు శ్రీ కనక దుర్గా దేవి ఆలయంలో అమ్మవారు బాలత్రిపుర సుందరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం వేకువజాము నుండి అమ్మ వారికి శ్రీ సూక్త విధానంలో పంచామృతములతో అభిషేకం, పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు, సహస్ర నిమ్మ కాయలతో మహిళలు, భక్తులచే పూజలు అనంతరం గాయత్రి హెూమం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు వి.శివ కుమార్ శర్మ తెలిపారు. చుట్టుపక్కల గ్రామాలు, పట్టణాలు నుండి భక్తులు ఇక్కడకు విచ్చేసి అమ్మవారికి మొక్కులు తీర్చుకుని, దుర్గాదేవిని దర్శించుకోవడం, భవాని దీక్షలు చేపట్టడం ఇక్కడి ప్రజలు నమ్మకం. దుర్గ దేవి దర్శనంకు వచ్చెడి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు మోటార్ వర్కర్స్ యూనియన్ కమిటీ తెలియజేసారు. చుట్టుపక్కల దామునా పల్లి, మైచర్లపాలెం, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో దుర్గాదేవి విరివిగా దుర్గాదేవి విగ్రహాలు నెలకొల్పి, నియమ నిష్టలతో శరన్నవరాత్రుల భవాని పూజలు నిర్వహిస్తున్నారు.

కొత్తపెంట పంచాయతీ కార్యదర్శికి సత్కారం

విశాలాంధ్ర - దేవరాపల్లి: దేవరాపల్లి మండలంలోయం కొత్త పెంట సచివాలయం, ములకలాపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఎం.ఎస్.ప్రకాష్ శుక్రవారం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కొత్తపెంట గ్రామ సర్పంచ్, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ మెడికల్ సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కొత్త పెంట సర్పంచ్ రొంగలి వెంకట్రావు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శిగా భాధ్యతలు స్వీకరించిన నాలుగు సంవత్సరాల పాటు అటు ములకలాపల్లి గ్రామంలో ఇటు కొత్త పెంట గ్రామ సచివాలయం పంచాయతీ కార్యదర్శిగా అదనపు భాధ్యతలు చేపట్టి కొత్త పెంట గ్రామంలో ఒకటిన్నర సంవత్సరం పాటు రెండు గ్రామాల అభివృద్ధికి ఎంతగానో సేవలను అందించారని కొనియాడారు. అటు సచివాలయ సిబ్బంది ఇటు పాలక వర్గంలో సన్నిహితంగా ఉంటూ అందరితో ఒక కుటుంబ సభ్యునిగా కలిసి పని చేసి ఇప్పుడు మా అందరినీ విడిచి వెళ్ళడం కొంచెం బాధగా వున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్త పెంట గ్రామ సర్పంచ్ రొంగలి వెంకట్రావు, సచివాలయం సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.